సీరియల్

వి.యస్.రావ్

(గత సంచిక తరువాయి)

ఉదయం పది దాటింది.

క్రైమ్‌బ్రాంచ్ చీఫ్ ఆత్మారామ్ తన యెదురుగా కూచున్న మనోజ్‌ని చిరునవ్వుతో చూశాడు. కానిస్టేబుల్ రెండు కప్పుల్లో టీ పోసి, ఇద్దరిముందూ పెట్టాడు.

"గిరీ, మళ్ళీ నేను ఈ తెరువిచ్చేదాకా యెవర్నీ లోపలికి రానీయొద్దు. నువ్వుకూడా రావొద్దు!" చీఫ్ ఆత్మారామ్ ఆజ్ఞాపించాడు.

"యెస్సర్!" అంటూ కానిస్టేబుల్ గిరి తలుపు మూసుకుంటూ గదిలోంచి నిష్క్రమించాడు.

కరోనా సిగార్ వెలిగించి ఆత్మారామ్ టీ కప్పు అందుకున్నాడు. ఒకసారి చప్పరించి కప్పుని కిందపెట్టి

మనోజ్ వైపు చూశాడు. అతని చుట్టూ సిగార్ పొగ పల్చటి మేఘం లా అలుముకుంది.

"మనోజ్, జయసింహా గారి సిఫార్సుకి విలువ ఇస్తూ ఐజీగారు నీకు సహాయం చేయమన్నారు. ఇలాంటివి నాకు నచ్చకపోయినా, ముక్కుకి సూటిగా వెళ్ళే ఇద్దరు పెద్దమనుషుల అంచనాని నిర్లక్ష్యం చేయడం ఇష్టంలేక నేను అంగీకరించాను...."

"థాంక్యూ సర్!" మనోజ్ వినయంగా అన్నాడు.

చీఫ్ ఆత్మారామ్ పొగని చుట్టకొసమీదికి ఊదుతూ అతన్ని సూటిగా చూశాడు.

"నీ విషయంలో జయసింహా గారి అంచనా తప్పులేదని రాత్రి నువ్వు చేసిన అడ్వెంచర్ తో గ్రహించాను. అయితే డాక్టర్ సంజీవరావు స్టేట్ మెంట్ కొంతవరకే నీకు— ఐ మీన్ మనకు—ఉపయోగిస్తుంది. దానిప్రకారం మీ అన్నయ్య గీతమీద అత్యాచారం చేయలేదని మాత్రం మనం రుజువు చేయొచ్చు. ఆమెని హత్య చేయలేదని నిరూపించలేం..." చీఫ్ ఆత్మారామ్ ఆగి, టీ తాగేశాడు.

మనోజ్ మౌనంగా వింటున్నాడు.

"తరవాత—కరుణాకర్ తన భార్యకి విషప్రయోగం చేయలేదనీ మనం నిరూపించలేం. ఎవరో ఇద్దరు వ్యక్తులకి డాక్టర్ సంజీవరావు సైనైడ్ ఇచ్చినంతమాత్రాన, వాళ్ళు మీ వదినకి దాన్ని త్రాగించారని మనం టెక్నికల్ గా రుజువు చేయలేం...."

"మా అన్నయ్య వదిన చేత హార్లిక్స్ తాగించేముందు అందులోకి ఆ వ్యక్తులు సైనైడ్ కలిపివుంటారు. ఇదే ఖచ్చితంగా జరిగింది. ఒక పొడుగాటి వ్యక్తి ఒక పొట్టి వ్యక్తి తనని ఇంట్లోంచి దౌర్జన్యంగా తీసికెళ్ళినట్టు

అన్నయ్య కోర్టులో చెప్పాడు!" మనోజ్ ఉద్రేకంతో అన్నాడు.

"నీ రీజనింగ్ ని నేను నమ్ముతాను. అంతే జరిగి వుంటుంది. అంతే జరిగింది అనీ ఒప్పుకుందాం. కానీ నమ్మకం ఒక్కటే మనకు చాలదు!" చీఫ్ ఆత్మారామ్ నవ్వుతూ అన్నాడు.

మనోజ్ అతన్ని బలహీనంగా చూశాను. "సార్, అయితే ఏం చేయమంటారు?"

"ఏం చేయమనీ నేను చెప్పను. నువ్విచ్చిన ప్లాన్ ప్రకారం దీని వెనక ఎవరున్నారో మనకి తెలుస్తోంది. మేం ఆ వ్యక్తి మీదకి మాకి ఏదో చేయలేం. మన చేతిలో వున్న జల్లెడలో నీళ్ళని ఉంచలేం!"

"యూ ఆర్ కరెక్ట్ సార్ ...." మనోజ్ మెల్లగా అన్నాడు. "నిజాన్ని నిలబెట్టే ఆధారాలకోసం ప్రయత్నిస్తాను...."

మనోజ్ లేచాడు. చీఫ్ ఆత్మారామ్ అతన్ని సానుభూతితో చూశాడు.

"గుడ్ లక్!"

"థాంక్యూ సర్" మనోజ్ సెల్యూట్ చేసి వెనక్కి తిరిగి, గుమ్మం ముందుకు నడిచాడు.

"మనోజ్ ...."

మనోజ్ తిరిగి, చీఫ్ ఆత్మారామ్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ఆత్మారామ్ లేచి నిలబడ్డాడు. కాలుతున్న చుట్టని ఒకసారి చూసి, చూపుల్ని మనోజ్ వైపు తిప్పాడు.

"మనోజ్ ....,మరిచిపోవద్దు, బాబ్జీని హత్య చేసింది

నుశ్వ అని డిపార్ట్‌మెంట్‌కి ఇన్ఫర్మేషన్ అందింది. ఆ ఇన్ఫర్మేషన్ న్యూస్ పేపర్స్‌కి తెలిస్తే ప్రమాదం! పైగా ఆ వార్త ఇట్టేకాలం న్యూస్ పేపర్స్‌కి తెలీకుండా వుంటుందని అనుకోడానికి లేదు. సో, యూ హావ్ నాట్ గాట్ మచ్ టైమ్!" చీఫ్ ఆత్మారామ్ చిన్నగా నవ్వాడు.

మనోజ్ నవ్వలేదు. "గుర్తుచేసినందుకు ధన్యవాదాలు సార్."

"ఇట్సాల్ రైట్. ఎక్కడికెళ్తున్నావ్? ఏం చేస్తావ్?" చీఫ్ ప్రశ్నించాడు.

"ఎక్కడికి వెళ్తున్నానో, ఏం చేయబోతున్నానో తెలీదు సార్. తెలిసిన మరుక్షణం మీకు తెలియజేస్తాను. థాంక్స్ ఫర్ ఎవ్విరిథింగ్ సర్!" అంటూ మనోజ్ తలుపు తెరుచుకుని వెళ్ళిపోయాడు.

చీఫ్ ఆత్మారామ్ మనోజ్ వెనకే మూసుకున్న తలుపుని చూస్తూ క్షణకాలం అలాగే నిలబడ్డాడు. మెల్లిగా అతని కనుబొమలు ముడిపడ్డాయి. కుర్చీలో కూచుని టెలిఫోన్ అందుకున్నాడు. రిసీవర్ని చెవికి ఆన్చి కాసేపు విగ్రహంలా ఉండిపోయాడు. తలపంకించుకుంటూ ఒక నంబరు తిప్పాడు.

అటువైపునుండీ బొంగురు కంఠం పలికింది. చీఫ్ ఆత్మారామ్ మొహంమీద చిరునవ్వు ప్రత్యక్షమైంది. తలుపుని చూస్తూ, తగ్గు స్వరంలో యేదో చెప్పసాగాడతను....

• • •

వణుకుతున్న డా॥ సంజీవరావు చూపుడువేలు నంబర్ని డయల్ చేసింది. రిసీవర్ని యెడంచేత్తో చెవికి

గట్టిగా నొక్కుతూ చేతి వణుకుని తగ్గించే ప్రయత్నం చేశాడతను. బట్టతలమీదా, నుదురుమీదా పూసల్లా పేరుకున్న చెమటని అరచేత్తో తుడ్చుకున్నాడు. అటు వైపున రిసీవర్ ఎత్తబడింది.

“ఎవరు?” బొంగురు కంఠం అతని చెవిలో నిర్లక్ష్యంగా మొరిగింది.

సంజీవరావు నాలుకతో పెదాల్ని తడుపుకున్నాడు.

“డాక్టర్ని.........విరూపాక్షరావుగారితో మాట్లాడాలి. ఎమర్జెన్సీ!”

అటువైపునుండి జవాబులేదు. రెండుక్షణాల తర్వాత సంజీవరావు మొహం కొద్దిగా వికసించింది.

“ఎస్, డాక్టర్!”

“మిస్టర్ విరూపాక్షరావ్, యూ ఆర్ ఇన్ ట్రబుల్!” సంజీవరావు కీచుగా అరిచాడు.

“ఏమిటది?” విరూపాక్షరావు కంఠం తొణక్కుండా గంభీరంగా ధ్వనించింది.

“కరుణాకర్ తమ్ముడు....,మనోజ్!” సంజీవరావు క్లుప్తంగా అన్నాడు.

“కమాన్ డాక్టర్! ప్రిస్క్రిప్షన్‌లా పొడిపొడిగా వొద్దు. నాకు ఫుల్ రిపోర్టు కావాలి!” విరూపాక్షరావు విసుగ్గా అన్నాడు. అతని కంఠంలోని ఆత్రుతని సంజీవరావు గుర్తించాడు.

సంజీవరావు బరువుగా నిట్టూర్చాడు.

“డాక్టర్, గాలితీసేసిన సైకిల్ ట్యూబులా నా చెవిలోకి నిట్టూర్చొద్దు! కమాన్! టాక్!” విరూపాక్షరావు అరిచాడు.

“రాత్రి అతను నన్ను కల్సుకున్నాడు...రివాల్వర్‌తో,

కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పినట్టు ఒప్పేసుకుంటూ స్టేట్ మెంట్ రాసిమ్మన్నాడు...."

"రాసిచ్చావా?" విరూపాక్షరావు కంఠధ్వని చిటికెలో మారింది.

"....లేదు......ఎలాగో తప్పించుకున్నాను. ఇవాళ రమ్మన్నాను...."

"వెరీగుడ్! వస్తాడా?"

"రాత్రి పదకొండు దాటాక వస్తే ఆలోచిస్తా అన్నాను. పాతిక వేలు ఇస్తానన్నాడు...."

"డాక్టర్, ఎప్పుడూ ఫీజు గురించే మాట్లాడతావ్" విరూపాక్షరావు యేదో చెప్పబోయాడు.

"మిస్టర్ విరూపాక్షరావ్. సీరియస్ గా మాట్లాడుతున్నా. నాకు గుండెదడ వచ్చేలా వుంది. ఈ ఊబిలోకి మీరే నన్ను దించారు; మీరే పైకి లాగాలి! ప్లీస్ డూ సమ్‌థింగ్! లేకపోతే అతను నన్ను కోర్టుకి లాగేలా వున్నాడు...."

"లాగుతాను. భయపడకు! రాత్రికి అతను రాగానే, మాటల్లోకి దింపు. మనవాళ్ళొస్తారు. ఆపైన వాడి పోరుండదు! వోకే?" విరూపాక్షరావు గంభీరంగా అడిగాడు.

"ఖచ్చితంగా మీరు యేదో చేయాలి. లేకపోతే నాచేత అతను రాగం తానం పల్లవి—అంతా పాడించేలా వున్నాడు. అప్రూవర్ గా మారిపొమ్మని సలహా యిచ్చాడు...."

"ఐసీ." విరూపాక్షరావు అడ్డుతగిలాడు. "డాక్టర్, నాకు ఫోన చేసి మంచి పని చేశావు. అతను నీ గదిలోకి రాగానే మనవాళ్ళు వాణ్ణి స్వాధీనం చేసుకుంటారు.."

"నా ఇంట్లో యుద్ధాలూ, ఖూనీలు జరగటానికి వీల్లేదు!" సంజీవరావు కంగారుగా అడ్డుకగిలాడు.

"డోంట్ గెట్ అప్ సెట్ డాక్టర్! వాడు నాకు ఆర్జెంటుగా కావాలి. పట్టిచ్చినందుకు రేపు నీ అకౌంటులో పాతిక వేలు జమ అవుతాయి! వోకే?"

"ధాంక్యూ.........పాతిక వేలకన్నా నాకు పరువు ముఖ్యం!" సంజీవరావు గంభీరంగా అన్నాడు.

విరూపాక్షరావు గొల్లున నవ్వాడు. పటాలున నవ్వు ఆపేశాడు. అతని కంఠం స్పష్టంగా ధ్వనించింది: "డాక్టర్, అతను వచ్చిన అయిదునిమిషాల్లో మనవాళ్ళు రంగంలోకి దూకుతారు. అంతవరకూ వాణ్ణి మాటల్లో వుంచు. నిమ్మకునీరెత్తినట్టు ఉండు. చేతనయితే విపరీతంగా భయం నటించు!"

అటువైపు క్లిక్ అంది. డా॥ సంజీవరావు రిసీవర్ని పడేసి, రెండు అరచేతుల్తో మొహాన్ని తడిపేస్తున్న చెమటని తుడుచుకున్నాడు.

"చాలా?" అన్నట్టు, తన యెదురుగా విగ్రహంలా కూచున్న వ్యక్తివేపు ఎర్రటి కళ్ళతో చూశాడు.

పెదాల మధ్య ఇరుక్కున్న సిగరెట్‌ని ఇవతలికి లాగి, పొగ వూదుతూ సంజీవరావుని చిరునవ్వుతో చూశాడు మనోజ్...

• • •

రాత్రి పదకొండూ ఇరవై అయింది.

తోటలో గాఢాంధకారంగా వుంది. అరగంట క్రితం నుంచీ చెట్లచాటున దాక్కున్న ఆ వ్యక్తులిద్దరూ నీడల్లా కదిలారు. భవనం వెనుకభాగం నుంచీ చప్పుడు చేయకుండా ముందువైపుకి నడిచారు. పోర్టికోకి ఎడంవైపున్న

కిటికీ షట్టర్ గుండా లోపలి వెల్తురు మసగ్గా అవుపిస్తోంది.

అనుచరుణ్ని పోర్టికోలో స్తంభం చాటున ఆపి, పొడుగాటి వ్యక్తి కిటికీ దగ్గరగా జరిగాడు. కొంచాన్ని అర్ధానికి అన్ని రెండు నిమిషాలు రాతిబొమ్మలా వుండిపోయాడు. నీళ్ళల్లోంచీ మసక మసగ్గా అవుపించే ఆకారాల్లా రెండు ఆకారాలు గదిలో అతనికి లీలగా అవుపిస్తున్నాయి. చిరునవ్వుతో అతని పెదవులు విచ్చుకున్నాయి. జంతువు బోనులో దూరింది!

చీకట్లో పళ్ళు ఇకిలించుకుంటూ అతను కదిలాడు. అనుచరుడు నీడలా అతని పక్కకి చేరాడు. గుమ్మంముందు, వరండాలో నిలబడి అతను చెవులు రిక్కించాడు. లోపల్నించీ యే చప్పుడూ రావడంలేదు.

పాంటు జేబులోంచీ పిస్టల్ని తీశాడతను. అతని ఎడమచెయ్యి తలుపుమీద వెడల్పుగా ఆనింది. తలుపు చప్పుడు చేయకుండా కొద్దిగా లోపలికి జరిగింది. వెల్తురు గీతలా వరండామీదికి సాగింది. ఎడమకంటిని తలుపు సందులో వుంచి, అతను హాలుని కాసేపు పరిశీలిస్తూ వుండిపోయాడు. అనుచరుడు వదుల్తున్న ఊపిరి అతని మెడని తాకుతోంది.

తృప్తికరంగా తల పంకిస్తూ అతను తలుపుని పూర్తిగా మెల్లిగా లోపలికి తోశాడు. తలదూర్చి, హాలుని మరోసారి సర్వే చేసి, అతను తన భారీ శరీరాన్ని తలుపు గుండా సరఫరా చేశాడు. అనుచరుడు రెప్పపాటులో లోపల దూరి, తలుపుని యథాప్రకారం మూసేశాడు. ఇద్దరూ ఊపిరి పీల్చుకోకుండా, గుమ్మంలోపల రాతి స్తంభాల్లా నిలబడ్డారు. వాళ్ళ నాలుగు కళ్ళూ హాలుని

క్షుణ్ణంగా వెతికేశాయి. ఎడమవైపున్న గదిలోంచీ ఏవో మాటలు అస్పష్టంగా వినిపిస్తోన్నాయి. చిరునవ్వులో ఇద్దరూ మొహాలు చూసుకున్నారు.

పక్కకి తిరిగి, గండు పిల్లుల్లా గదివేపు అడుగులు వేయడం ప్రారంభించారు.

“షో!” గది లోపల్నుంచీ యేదో కంఠం కంగారుగా కీచుగా అరిచింది.

వాళ్ళిద్దరూ ఆగలేదు. లోపలున్న వ్యక్తులు వాళ్ళ పనిలో వాళ్ళున్నారు. తమ రాకని వాళ్ళు గుర్తించరు! నాలుగు కాళ్ళు మొసాయిక్ మీద పిల్లి కాళ్ళలా కదుల్తున్నాయి....

“కదలకండి! చేతులెత్తి వెనక్కి తిరగండి!”

హాల్లో ప్రతిధ్వనించిన కంఠాన్ని విని ఇద్దరూ వులిక్కిపడి, అప్రయత్నంగా ఆగారు. అదే క్షణంలో తటాలున వెనక్కి తిరిగారు. కానీ యిద్దరూ చేతులు యెత్తలేదు....

కుడివైపు గది గుమ్మంముందు, రెండు పాదాల్ని యెడంగా వుంచుకుని నించున్న మనోజ్ ని యిద్దరూ ఆశ్చర్యంగా చూశారు. మనోజ్ ఎడమచేతిలోని రివాల్వర్ యిద్దర్నీ చూస్తోన్నట్టుంది. అతని కుడిచెయ్యి తొడ వెనక వేళ్ళాడుతోంది.

“ధర్మరాజా, విభీషణ్....విషాన్, పోతరాజా, జాకీ....రివాల్వర్లని కిందికి వదిలి చేతులెత్తండి! క్విక్!” మనోజ్ కంఠం స్పష్టంగా ధ్వనించింది.

ఇందాకా ఎడమవైపు గదిలో వున్నాడనుకున్న మనోజ్ కుడివైపు గదిముందుకి యెలా చేరాడు? పోతరాజు ఆశ్చర్యంతో అనుకున్నాడు. క్షణంలో సగంలో

అతను ఆశ్చర్యంనుండీ తేరుకున్నాడు. జాకీ పోతరాజుని వోరంగా చూస్తోన్నాడు. పోతరాజు చెయ్యి యెత్త లేదు.

"మనోజ్....నీ కోసమే చూస్తున్నాం, మమ్మల్ని తప్పించాక నువ్వు మాయమైపోయావ్! రావుగారు నిన్ను తీసుకురమ్మన్నారు....పోతరాజు మనోజ్ కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడసాగేడు. మనోజ్ కళ్ళు అతని కళ్ళ ల్లోకే చూస్తున్నాయి, పోతరాజు కళ్ళల్లో ఏదో మార్పు తళుక్కున మెరిసి మాయమైంది. అది, మనోజ్ చూపు ల్నుంచీ తప్పించుకోలేకపోయింది....

పోతరాజు చేతిలోని రివాల్వర్ కి ఉన్నట్టుండి ప్రాణం వచ్చింది. కానీ, ఆ ప్రాణం రావడంలో రెప్పపాటు ఆలస్యం జరిగిపోయిందని పోతరాజుకి తెలీదు....

మనోజ్ యెడమ చేతిలోని రివాల్వర్ నిప్పులు కక్కింది. తూటా వేడిగా పోతరాజు మణికట్టుని చీల్చేసింది. అతని చేతిలోని రివాల్వర్ పేలుతూ, దూరంగా యెగిరిపడింది.

అనుచరుడి ఉద్దేశాన్ని గ్రహించిన జాకీ చేతిలోని రివాల్వర్ని తటాలున గురిపెట్టాడు. కానీ మనోజ్ ఎడమ చేతిలోని రివాల్వర్ పేలక ముందే, అతని కుడిచేతిలో వేళ్ళాడుతున్న కత్తి వెలుగుకిరణంలా తనవేపు దూసుకు రావడం అతను చూడలేకపోయాడు....

అప్రయత్నంగా జాకీ అరిచాడు. రివాల్వర్ దూరంగా ఎగిరిపడింది. మణికట్టులో పిడిదాకా దిగిపోయిన కత్తిని అతను కంగారుగా చూసుకున్నాడు.

చేతిలోంచీ దూసుకెళ్ళిన కత్తి, రివాల్వర్ లోంచీ దూసుకెళ్ళిన తూటాల వెంట మనోజ్ పరుగెత్తాడు. రక్త

నిత్తంగా వున్న తన అరచేతిని చూసుకున్న పోతరాజు, జాకీ చేతిలో గుచ్చుకున్న కత్తిని కళ్ళ కొనల్నుంచీ చూశాడు. తెగించిన పోతరాజు జాకీ చేతిలో బలంగా నాటుకుపోయిన కత్తిని నిర్దాక్షిణ్యంగా లాగాడు. బడితె దెబ్బతిన్న పందిలా జాకీ కీచుగా అరిచాడు. అసంకల్పితంగా, పోతరాజు ఎడమచేతిని పట్టేసుకుని, కత్తిని లాగకుండా ఆపాడు.

ఆ దే క్షణంలో మనోజ్ చేతిలోని రివాల్వర్ పోతరాజు చెంపమీద సుత్తిలా తాకింది. పోతరాజు అరిచాడు. చెంపమీంచి రక్తం కాలువకట్టింది.

"చేతులెత్తండి!" మనోజ్ హుంకరించాడు.

ఓడిపోయిన పోతరాజూ, జాకీ చేతులెత్తేశారు.

"వెనక్కి తిరగండి!" రివాల్వర్ కొనతో పోతరాజుని పొడుస్తూ మనోజ్ ఆజ్ఞాపించాడు.

ఇద్దరూ వెనక్కి తిరిగారు. పోతరాజు బుసకొడుతున్నాడు. ఏడుపుగా మారుతున్న మూలుగుని దిగమింగడానికి జాకీ విఫలప్రయత్నం చేస్తున్నాడు. పోతరాజు లాగడంతో కొద్దిగా కదిలి, యేటవాలుగా వేళ్ళాడుతోంది అతని చేతిలో గుచ్చుకుపోయిన కత్తి.

"కదలండి! ఊ!" మనోజ్ ఆదిలించాడు. ముక్కుతాళ్ళు వేయబడిన, మదించిన ఆబోతుల్లా యిద్దరూ కదిలారు.

"డాక్టర్, తలుపు తెరు!" మనోజ్ అరిచాడు.

గది తలుపులు బార్లా తెరుచుకున్నాయి. గుమ్మంలో నిలబడ్డ డాక్టర్ సంజీవరావుని పోతరాజూ, జాకీ ఆశ్చర్యంగా చూశారు. సంజీవరావు ధరించిన కళ్ళజోడులో ఒక అద్దం గజిబిజిగా పగిలింది. అతని ముక్కుల్లోంచీ

రక్తం కాలువలుగా కారుతోంది. చొక్కా రక్తంతో తడిసి భయానకంగా అవుపిస్తోంది. అతను వణుకుతున్నాడు....

మనోజ్ యిద్దర్నీ గదిలోకి తోసి, కాలితో తలుపు మూశాడు.

"డాక్టర్ ఆ రెండు బెంచీలని వెల్లకిలా తిరగేయ్!" మనోజ్ ఉత్తరువిచ్చాడు.

"ఎ....ఎందుకు?...." సంజీవరావు తడబడుతూ అడిగాడు.

"డాక్టర్, ప్రశ్నలు అడక్కూడదనీ, జవాబులు చెప్తూ, చెప్పింది చేస్తూ వుండాలనీ నీకు యిందాకే చెప్పాను!" మనోజ్ హుంకరించాడు.

తడబడుతూ, వొణుకుతూ డాక్టర్ సంజీవరావు బెంచీలవైపు తాగినవాడిలా అడుగులేశాడు. రెండు బెంచిలనీ వెల్లకిలా పక్కపక్కనే పడేశాడు.

మనోజ్ కదిలి, వారిద్దరి ముందూ ఆగాడు. వాళ్ళ మొహాల్లోకి తీక్షణంగా చూశాడు.

"బెంచీల కాళ్ళ మధ్య యిరుక్కుని వెల్లకిలా పడుకోండి! క్విక్!" మనోజ్ కంఠం తూటాలా పేలింది,

పోతరాజు అర్థంకానట్టు చూశాడు. పైకెత్తిన చేతి గుండా రక్తం కిందికి కారిపోతోంది.

"మనోజ్....మా దారిన మమ్మల్ని పోనీ....లేకపోతే తర్వాత విచారిస్తావు! బాస్ సంగతి నీకు..."

మనోజ్ పిడికిలి సమ్మెటలా పోతరాజు మూతిమీదికి దిగింది. అతను చెప్పబోయిందాన్ని మధ్యలో ఆపేసింది. చిట్లిపోయిన పోతరాజు పెదవులు రక్తం చిమ్మడం ప్రారంభించాయి.

"బెంచీల మధ్య వెల్లకిలా...." మనోజ్ మాట పూర్తి చేయక ముందే పోతరాజు కదిలాడు.

బెంచి మధ్య కూచుని కాళ్ళు జాపాడు. మెల్లిగా వెనక్కి వాలాడు. భయానికి పట్టిన అద్దాల్లా వున్న కళ్ళతో మనోజ్ వైపు చూశాడు.

జాకీ తన అనుచరుడిలాగా బెంచీ మధ్యలో కూచున్నాడు. వెల్లకిలా పడుకోబోతూ ఆగాడు. రక్తంతో తడిసిపోతున్న చేతినీ, కత్తినీ ఆందోళనతో చూశాడు. చూపుల్ని దీనంగా మనోజ్ వైపు తిప్పాడు.

"నా చెయ్యి....కత్తి ..." నత్తిగా అన్నాడతను.

"పడుకో!" మనోజ్ గర్జించాడు. జాకీ కిక్కురుమనకుండా పడుకున్నాడు.

మనోజ్ డాక్టర్ వైపు వోరగా చూశాడు, సంజీవరావు పోతరాజునీ, జాకీనీ కంగారు చూస్తున్నాడు.

"డాక్టర్ కుర్చీని వీళ్ళ కాళ్ళవైపు లాక్కుని కూచో!" మనోజ్ ఆజ్ఞాపించాడు.

సంజీవరావు క్షణంలో కుర్చీ లాగి, కూచుని వెల్లకిలా బెంచీల మధ్య యిరుక్కున్న యిద్దర్నీ రెప్ప వేయకుండా చూడసాగేడు.

మనోజ్ టేబుల్ మీదవున్న తన లెదర్ బాగ్ లోంచి నైలాన్ తాళ్ళని తీశాడు. నవ్వుతూ పోతరాజువైపు చూస్తూ, నడిచి అతని తలవైపు కూచున్నాడు.

రెప్పలు దించుకుంటూ పోతరాజు అతనివైపు ఎర్రటి కళ్ళతో చూశాడు. నైలాన్ తాడు కొసని ఉచ్చులా ముడేసి, మనోజ్ తన పనికి ఉపక్రమించాడు. జాకీ పిచ్చివాడిలా చూడసాగేడు.

* * *

మనోజ్ హాల్లోకి నడిచాడు.

గోడవారగా పడున్న పోతరాజు రివాల్వర్నీ, మధ్యలో పడున్న జాకీ రివాల్వర్నీ జేబురుమాలుతో పట్టుకుని గదిలోకి ప్రవేశించాడు. వాట్ని టేబుల్ సొరుగులో పడేశాడు.

గోడవారగా వున్న బీరువామీదున్న ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్ని తీసుకుని పోతిరాజూ, జాకీ పడున్న బెంచీల మధ్యలో నిలబెట్టాడు. లేచినిలబడి యిద్దర్నీ నవ్వుతూ చూశాడు.

పోతిరాజు కాళ్ళూ, చేతులూ వెల్లకిలా వున్న బెంచీ కాళ్ళకి గట్టిగా కట్టబడ్డాయి. చేతుల్ని బిగించిన తాడు అతని గడ్డ కింద గొంతుకమీదుగా సాగింది.

పోతిరాజు గుటకలు మింగుతూ చూశాడు. అతని మొహం చెమటతో మెరుస్తోంది చేతినుంచీ యింకా రక్తం కారుతూనే వుంది.

జాకీ సన్నగా మూలుగుతున్నాడు. అతని కాళ్ళూ చేతులూ బెంచీ కాళ్ళకి బంధించబడ్డాయి. మణికట్టు లోంచి కత్తి వేళ్ళాడుతోంది.

ఐరన్ బాక్స్కి వైర్ కొసని కనెక్ట్ చేసి, మనోజ్ గోడవారగా కదిలాడు. చేతిలోని ప్లగ్ని సాకెట్లో గుచ్చాడు. పోతిరాజూ, జాకీ, డాక్టర్ సంజీవరావు— ముగ్గురూ అతన్ని అయోమయంగా చూస్తున్నారు.

మనోజ్ జాకీ తల దగ్గరగా ఆగాడు. అతని బూటు జాకీ చేతిని తొక్కింది. జాకీ కంగారుగా పైకి చూశాడు. మనోజ్ కిందికి వంగి, కత్తిపిడిని పట్టుకున్నాడు. అతని చెయ్యి మెరుపులా కదిలింది. జాకీ కెవ్వుమన్నాడు.

తనచేతిలోకి ఊడివచ్చిన రక్తసిక్తంగా వున్న కత్తిని

ఒకసారి చూసి, మనోజ్ సంజీవరావువైపు చూశాడు. సంజీవరావు కళ్ళు గోలీల్లా పైకి పొడుచుకువస్తున్నాయి.

"డాక్టర్, వీళ్ళిద్దరి చేతులకీ గాయాలయ్యాయి. కొంచెం టింక్చర్ పోయి!" మనోజ్ సలహా యిచ్చాడు.

సంజీవరావు క్షణకాలం తటపటాయించి కుర్చీలోంచీ లేచాడు. టింక్చర్ బాటిల్ కాటన్ పట్టుకుని వాళ్ళ దగ్గరగా కూచున్నాడు.

"క్లీనింగ్, డ్రెస్సింగ్ అవసరంలేదు, డాక్టర్. మంట పుట్టేలా టింక్చర్ పోయి! మారో పాతిక నిమిషాల్లో నీ స్నేహితులిద్దరి శరీరాలూ కొత్త కొత్త గాయాల్తో నిండిపోతాయి! ఒకేసారి అన్నింటినీ మరిమ్మత్తు చేద్దువుగానీ!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

పోతరాజూ జాకీ గాభరాగా చూశారు. సంజీవరావు మొహం పాలిపోయింది. వణుకుతున్న చేత్తో టింక్చర్ బాటిల్ని అందుకుని కార్క్ తీశాడతను. కాస్సేపట్లో పోతరాజూ, జాకీ అరిచారు.

"డాక్టర్, నీ సింహాసనంమీద కూచో!" అన్నాడు మనోజ్ మరో నైలాన్ తాడుని అందుకుంటూ. రెండు నిమిషాల్లో డాక్టర్ని కుర్చీకి బంధించి అతను ఐరన్ బాక్స్ దగ్గరగా నడిచాడు. మధ్యలో నిలబడి ఇద్దరి మొహాల్లోకీ నవ్వుతూ చూశాడు.

కత్తిని వాటంగా పట్టుకుని పోతరాజు దగ్గరగా కూచున్నాడు. ఎడంచేత్తో ఎత్తిపట్టుకుని, అతని షర్ట్‌ని కత్తితో పర్రున కోశాడు. తరవాత చొక్కా చేతుల్ని కోసేశాడు పోతరాజు బనియన్ వేసుకోలేదు, పీలికలై పోయిన చొక్కా ముందుభాగాన్ని మనోజ్ దూరంగా విసిరాడు. పోతరాజు ఛాతీ కంబళిలా ఉంది. అతని

పొట్ట కొలిమితిత్తిలా కదుల్తోంది. క్షణంలో జాకీ చొక్కానీ కోసి, తీసేసిన మనోజ్ నిలబడ్డాడు.

"అడ్వొకేట్ కరుణాకర్ భార్య తాగే హార్లిక్స్‌లో మీరిద్దరూ సైనైడ్ కలిపారు. ఆయన అసిస్టెంట్ గీతని అమానుషంగా రేప్ చేసి, మర్డర్ చేశారు. అదంతా ఎలా చేశారో, ఎందుకు చేశారో, ఎవరో చేయమన్నారో—అంతా పూసగుచ్చినట్టు ఇప్పుడు మీరు చెప్తారు...."

"నో!" పోతరాజు కంగారుగా అరిచాడు.

మనోజ్ అతన్ని చిరునవ్వుతో చూశాడు. "పోతరాజూ, కరుణాకర్ భార్య, గీత, కోర్టులో సాక్ష్యం చెప్పిన అమాయకులూ, అడ్వొకేట్ అన్నారావూ, ఆయన తల్లీ—వగైరా వ్యక్తుల్ని ఎలా, ఎందుకు చంపింది నువ్వు బుర్రకథలా చెప్తావు. జాకీ దాన్ని సరిపైపై చేస్తాడు. నువ్వు అబద్ధం ఆడినప్పుడు జాకీ సరిదిద్దుతాడు" మనోజ్ ఆగి టేబుల్ దగ్గరగా నడిచాడు. నీళ్ళున్న గాజు లోటాని పట్టుకుని తిరిగొచ్చాడు.

వేడెక్కిన ఐరన్ బాక్స్‌మీద కొద్దిగా నీళ్ళుపోశాడు, 'చుయ్'మంటూ చప్పుడైంది. పోతరాజూ, జాకీ ఒకే సారి ఉలిక్కిపడ్డారు. మనోజ్ పోతరాజుని చిరునవ్వుతో చూశాడు.

"పోతరాజూ, పాటకచ్చేరీ ప్రారంభించు! ఆపకుండా, అబద్ధాలాడకుండా అంతా కక్కెయ్....! ఇస్త్రీ పెట్టె బాగా—బాగా వేడెక్కింది. నోరు విప్పక పోతే మొదట నీ రెండు చెంపల్నీ, బోడిగుండునీ ఆ తరు వాత ఛాతీని ఇస్త్రీ చేసేస్తాను...." మనోజ్ ఆగి చూశాడు.

"నో....నో.... మేం ఏపాపం ఎరగం....అవన్నీ మేం చేయలేదు. శత్రువుల చేతుల్లో మగ్గుతున్న మమ్మల్ని నువ్వే రక్షించావ్!" పోతరాజు బొంగురుగా అరిచాడు.

మనోజ్ మాట్లాడకుండా పైకిలేచాడు. గోడవారగా నడిచి, ప్లగ్ తీసేశాడు. హాండిల్ పట్టుకుని ఇస్త్రీపెట్టెని పైకెత్తాడు. దాన్ని పోతరాజు మొహంమీద, రెండంగుళాల యెత్తులో పట్టుకున్నాడు.

పోతరాజు పెదవులు అదరసాగేయి. ఇస్త్రీపెట్టె వేడి అతని మొహానికి తాకుతోంది. అప్రయత్నంగా అతను కళ్ళు మూసుకున్నాడు.

"మనోజ్...." డాక్టర్ కంగారుగా పిలిచాడు.

"యస్ డాక్టర్!" మనోజ్ కంఠంలో వెటకారం ధ్వనించింది.

"కాలిన లోహం మనిషికి తాకితే యేమవుతుందో నీకు తెలీదనుకుంటాను....చర్మం కాలి, మాంసం వూడి వచ్చేస్తుంది! డోంట్ డూ ఇట్!"

"షటప్!" మనోజ్ హుంకరించాడు. "ఈసారి మాట్లాడితే నీ నోటిమీద దీన్ని అదిమిపెడతాను!" అంటూ అతను చేతిని కొద్దిగా కదిల్చాడు.

పోతరాజు భయంకరంగా అరిచాడు. ఇస్త్రీపెట్టెని దూరంగా లాగి, మనోజ్ అతన్ని నవ్వుతూ చూశాడు. పోతరాజు ఎడమ బుగ్గమీద బొటనవేలి గుర్తులా చర్మం మాడింది. ఇస్త్రీపెట్టె పాయింట్ తాకిన గుర్తు....

"అరుపులు కాదు. అసలు సంగతి కావాలి నాకు!" మనోజ్ పోతరాజు కళ్ళలోకి చూస్తూ గద్దించాడు. పోతరాజు మొహంమీద భయం, ఆశ్చర్యం ముద్ర

వేళాయి. అతని కళ్ళు ఉచ్చులో తగులుకున్న చిరుతపులి కళ్లలా ఉన్నాయి.

"పోతరాజూ, ఇప్పుడే నీ దవడలు ఊడిపోడం నాకు ఇష్టంలేదు! నీ గోళ్ళమీద శాంపిల్ ట్రీట్ మెంట్ ఇస్తాను!" అంటూ మనోజ్ ఇస్త్రీపెట్టెని అతని వేలికి దగ్గరగా జరిపాడు.

"వొద్దు!" పోతరాజు అరిచాడు. మనోజ్ అతన్ని నవ్వుతూ చూశాడు.

"అయితే మాట్లాడు!"

"నేను.... నేను... ఇరుక్కుపోతాను...." పోతరాజు ఏడుపు గొంతుతో అన్నాడు.

మనోజ్ నవ్వాడు. "ఇప్పటికే ఇరుక్కున్నావు! నిజం చెప్తే నిన్ను వదిలేస్తాను. నాకు అసలు సత్యం కావాలి!"

"గురూ, చెప్పు!" జాకీ వొణుకుతూ సలహా ఇచ్చాడు.

పోతరాజు గుటకలు మింగాడు. ఇస్త్రీపెట్టె పాయింట్ అతని ఎడమచేతి బొటనవేలి గోరుమీద ఆనింది. పోతరాజు ఆపుకోలేక అరిచాడు.

"....చెప్తాను!"—కీచుగా అన్నాడతను.

"వెరీగుడ్! ప్రారంభించు. శ్రీనుంచీ శుభందాకా అంతా అప్పగించు!" మనోజ్ అన్నాడు.

పోతరాజు ప్రారంభించాడు....

* * *

మనోజ్ మౌనంగా అంతా విన్నాడు. డా॥ సంజీవరావు ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని విన్నాడు. మనోజ్ ఇస్త్రీపెట్టె ప్లగ్ ని మళ్ళా సాకెట్ లో గుచ్చాడు. సిగరెట్ వెలిగించి వెల్లకిలా పడుకుని ఆదుర్దాతో

చూస్తున్న జాకీ మొహంలోకి చూశాడు.

"జాకీ, నీ తోడుదొంగ చెప్పిందంతా నిజమేనా?"

"....నిజమే" జాకీ కంఠం వణికింది.

"కాసేపట్లో మీరు చెప్పిందంతా నిజమో కాదో తెలుస్తుంది. ఏమాత్రం అబద్ధం ఆడివున్నా, ప్లగ్ కనెక్షన్ అలాగే వుంచి, ఇస్త్రీ పెట్టెని మీ ఇద్దరి ఛాతీలమీద పెడ్తాను!" అంటూ మనోజ్ టేబుల్ వైపు నడిచాడు.

కుర్చీలో కూచుని టెలిఫోన్ రిసీవరెత్తి, ఒక నెంబర్ తిప్పాడు. అటువైపున యెవరో పలికారు. మనోజ్ తనకి కావల్సిన వ్యక్తి పేరు చెప్పాడు.

"మీరెవరు?" అవతలి కంఠం ప్రశ్నించింది.

"మనోజ్."

"విరూపాక్షరావ్ హియర్!" అందో కంఠం క్షణకాలం తర్వాత.

"విరూపాక్షరావ్, నన్ను వేటాడ్డానికి పంపించిన నీ రెండు వేటకుక్కలూ తోకలు తెగి, ముక్కులు పగిలి ఇక్కడ మూలుగుతూ పడున్నాయి!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

"వాట్ డూ యూ మీన్? యింతకీ ఎవరు నువ్వు? యేమిటి నీ పిచ్చి వాగుడు?" విరూపాక్షరావు రోషంగా అరిచాడు.

"అమాయకత్వం నటించొద్దు! పోతరాజా, జాకీ తక్కిన పేనుల్లా నా ముందు పడున్నారు. నీతో పాటూ పియం సైనైడ్ లాంటి పదార్థాలు సప్లై చేస్తూ, కోర్టులో నువ్వు నేర్పించిన పాట పాడుతూ తప్పుడు సాక్ష్యాలు పలికే చిలక—గవర్నమెంట్ డాక్టర్

సంజీవరావు కూడా తోడుగా పేషెంటులా మూలుగుతున్నాడు...."

"ఇంతకీ....నువ్వు చెప్పేదేమిటి?" విరూపాక్షరావు గర్జించాడు. ఆ గర్జనలో యిందాకటి దర్జాలేదు.

"జరిగిందంతా వాళ్ళు బృందగానం పాడుతూ, అమరంలా అప్పజెప్పేశారు...."

"వాట్?"

"నన్ను మధ్యపెట్టి, నీ శత్రువుల పిడికిలిలో యిరుకున్న నీ తొత్తుల్ని విడిపించుకున్నావు. మా అన్నయ్యకి జరిగిన అన్యాయానికి కారకులు వేరే వున్నారని కథలు చెప్పి తెలివిగా నన్ను నమ్మించావు. విరూపాక్షరావ్, దానికంతకీ చక్రవడ్డీతో పరిహారం చెల్లించాలి!" మనోజ్ గంభీరంగా అన్నాడు.

విరూపాక్షరావు తాత్కాలికంగా మూగవాడై పోయాడని టెలిఫోన్ చెప్తోంది.

"మనోజ్. ఎక్కడో పొరపాటు జరిగింది. నువ్వు తాడుని చూసి పాము అనుకొంటున్నావు...."

"బుర్రకథలు వింటానికి నాకు టైంలేదు! నిజం చెప్పాలంటే బుర్రకథలు వినిపించడానికి నీకు టైమ్ లేదు. నీకు కేవలం నలభైఅయిదు నిమిషాలు మాత్రం వ్యవధి యిస్తున్నా. ఆ వ్యవధిలోగా నేను ఆడమన్నట్టు నువ్వు ఆడకపోతే నీ శిష్యుల్ని నీ పర్సనల్ ఫిజీషియన్‌తో సహా, నీ శత్రువులకి అమ్మేస్తాను...."

"వాట్....!" విరూపాక్షరావు ఆశ్చర్యంగా అరిచాడు.

"రెండోసారి చెప్పను...." మనోజ్ కటువుగా అన్నాడు.

"ఆల్ రైట్....నీకేం కావాలి?" విరూపాక్షరావు బుకాయింపులు మాని బేరంలోకి దిగాడు.

మనోజ్ చిన్నగా నవ్వాడు. "అలా అడిగావ్; బావుంది. ఏ శిష్యుల్ని నాచేత బంధవిముక్తుల్ని చేయించావో, వాళ్ళని నీ శత్రువులకి విక్రయించకుండా వుండా లంటే నువ్వు రెండు పనులు చేయాలి...."

"ఏమిటవి....?" విరూపాక్షరావు అడ్డొస్తూ అడిగాడు.

"ఒకటి: నలభై అయిదు నిమిషాలు—ఐమీన్ నలభై రెండు నిమిషాల్లోగా నువ్వు పాతికలక్షలు నాకు చెల్లించాలి.

"నువ్వు చేస్తున్న నేరం యెలాంటిదో నీకు తెలుసా? పోలీసులకి...."

"వాళ్ళని నీ శత్రువులకి కాకుండా పోలీసువాళ్ళకి అప్పగింతలు చేయాలని కూడా నాకు ఆలోచన లేక పోలేదు...." మనోజ్ వెటకారంగా నవ్వాడు.

"ఆల్ రైట్ నీ రెండో కోరిక యేమిటి?" విరూపాక్షరావు కంఠంలో అసహాయతా, ఆగ్రహం కలిసి ధ్వనించాయి.

"కోరిక కాదు: ఆజ్ఞ! అయినా అదేమిటో నీకిప్పుడు చెప్తాను: పాతికలక్షల్ని సూట్ కేసులో సర్ది వొంటరిగా—గుర్తుంచుకో—వొంటరిగా నువ్వే రావాలి. కార్ని నువ్వే డ్రైవ్ చేయాలి. టవర్ క్లాక్ దగ్గర కారాపి అక్కణ్నుంచీ సూట్ కేసు మోసుకుంటూ యిక్కడికి రావాలి. నీ జేబుల్లో కారుతాళంచెవులు తప్ప, పెన్నా కత్తీ, రివాల్వర్, బాల్ పాయింట్ పెన్నా వగైరా వస్తువులేవీ వుండకూడదు...." (ఇంకా వుంది)